# సరబ్‌జిత్: సూత్రబద్ధ వైఖరి

కె.బాలగోపాల్

> సరబ్‌జిత్ సింగ్ ప్రాణం కాపాడడానికి కృషి చేయొద్దని కాదు. మరణ దండన విషయంలో సూత్రబద్ధమైన వైఖరి ఉండాలని. 1989 నాటి ఐక్యరాజ్యసమితి రెండవ ఆప్షనల్ ప్రోటోకాల్ పైన మన దేశం సంతకం చేసి పాకిస్థాన్‌ను కూడా సంతకం చేయమని ఆహ్వానిస్తే ఎంత బాగుంటుంది!

ద్వంద్వ ప్రమాణాలు మనకెంతగా అలవాటయిపోయాయంటే ఇంకొక్క ఉదంతాన్ని పేర్కొంటే ఎవ్వరికీ వినాలన్న ఆసక్తి కలగకపోవచ్చు. పాకిస్థాన్‌లో జైలులో ఉన్న సరబ్‌జిత్ సింగ్‌కు విధించిన మరణ దండనను ఖైదుగా మార్చమని మన దేశ ప్రభుత్వమూ, ప్రతిపక్షాలూ, మీడియా అన్నీ ఆ దేశ పాలకుల పైన ఒత్తిడి పెడుతున్న తీరుచూస్తే మనది మరణ దండన ఎరుగని దేశమేమో, ఇక్కడెవరూ ఉరిశిక్ష కోసం ఎదురు చూస్తున్న ఖైదీలు లేరేమో అనుకోవాలి. రాజీవ్ గాంధీ హత్య కేసులో ఒక్క నళినికి మాత్రం ఉరి నుంచి విముక్తి లభించగా శంతన్, మురుగన్, పేరారివాలన్ అనే ముగ్గురు 16 సంవత్సరాలుగా మరణ దండన అమలవుతుందో లేదో తెలియకుండ జైలులో ఉన్నారు. పార్లమెంటు దాడికేసులో ప్రధాన నిందితుడయిన మహమ్మద్ అఫ్జల్ 7 సంవత్సరాలుగా ఉరి కోసం ఎదురుచూస్తున్నాడు. రాజకీయేతర నేరాలలో మరణ దండన పడ్డవారు ఇంకెంత మంది ఉన్నారో తెలియదు. సరబ్‌జిత్ సింగ్‌కు ఉరిశిక్ష తప్పించమని మన ప్రభుత్వం పాకిస్థాన్‌ను కోరడం చాలా సహజమైన విషయంగానూ, ఉదాత్తమైన నడవడికగానూ ఈ దేశంలో అందరూ భావిస్తున్నారు గానీ ముషారఫ్ ధైర్యంచేసి అఫ్జల్‌కు ఉరి తప్పించమని మన ప్రభుత్వాన్ని కోరితే మన కందరికీ ఎంత కోపం వస్తుందో!

సరబ్‌జిత్ సింగ్ పై ఉన్న అభియోగం చిన్నదేమీ కాదు. చాలా మంది ప్రాణాలు తీసిన బాంబుదాడి కేసులో అతనిని దోషిగా పాకిస్థాన్ కోర్టులు తేల్చాయి. తీర్పు తప్పని ఇక్కడెవరూ అనడం లేదు. అనడం కష్టం కూడా. ఈ రెండు దేశాల మధ్యనున్న అనేక సామాన్య విషయాలలో నేర విచారణ వ్యవస్థ ఒకటి. ఇద్దరమూ మెకాలే పీనల్‌కోడ్‌నే అనుసరిస్తున్నాము. దానికి అనుబంధంగా రూపొందిన నేర విచారణ వ్యవస్థనే అమలు చేస్తున్నాం. అది న్యాయం చేస్తుందో అన్యాయం చేస్తుందో గాని రెండు దేశాలలోను ఒకేరకంగా చేస్తుంది. పాకిస్థాన్‌లో ప్రజలు ఎన్నుకొన్న ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ముషారఫ్ మంత్రివర్గంలోనే ఒక మానవ హక్కుల మంత్రి ఉన్నాడు. ఆయన ప్రభుత్వంలో మంత్రిలాగ కాక మానవ హక్కుల కార్యకర్తలా నడుచుకున్నాడు. శత్రు దేశంగా భావించబడే ఇండియా పురమాయింపు మీద తన దేశంలో బాంబు దాడులకు పాల్పడి అనేక మంది ప్రాణాలు తీసినట్టు అభియోగం రుజువయిన వ్యక్తి ప్రాణాన్ని కూడా కాపాడడానికి కంకణం కట్టుకున్నాడు. సరిహద్దుదాటి అతని గ్రామానికి పోయి అతని కుటుంబాన్ని కలిసి తన సానుభూతి తెలియజేశాడు. ఎట్లాగయినా ఉరి తప్పిస్తానని హామీ ఇచ్చాడు. పాకిస్థాన్ బదులు ఇండియాను, సరబ్‌జిత్ సింగ్ బదులు దావూద్ ఇబ్రహీంను ఊహించుకోండి. మన ప్రజాతంత్ర ప్రభుత్వంలో మానవహక్కుల మంత్రి లేడుసరే. ఒకవేళ దేశ మానవహక్కుల కమిషన్ చైర్మన్ ఈ రకంగా నడుచుకుంటే ఈ దేశం క్షమించేదా? అసలు అట్లా నడుచుకోవాలని మానవహక్కుల కమిషన్ చైర్మన్‌కు తోచేదా?

పాకిస్థాన్ ధైర్యం చేయటం లేదు గానీ, ఒక వేళ వాళ్ళు మీరు అఫ్జల్‌కు ఉరి తప్పిస్తే మేము సరబ్‌జిత్ సింగ్‌కు తప్పిస్తామని బేరం పెట్టారనుకోండి. ఇప్పుడు సరబ్‌జిత్ సింగ్ ప్రాణం కాపాడడానికి ఆరాటపడుతున్నవారిలో ఎంతమంది దానికి అంగీకరించమని ప్రభుత్వాన్ని కోరుతారు? ఒక వేళ ప్రభుత్వం అంగీకరిస్తే ఎంత మంది ప్రభుత్వాన్ని క్షమిస్తారు? ఆ బేరం పెడితే అఫ్జల్ తమ పురమాయింపు మీద పనిచేశాడని భారత్ చేస్తున్న ఆరోపణ రుజువయినట్టవుతుందని పాకిస్థాన్ వెనుకాడుతున్నది. నిజానికి పార్లమెంటు దాడి కేసులో పాకిస్థాన్ ప్రమేయం ఉందన్న ఆధారమేదీ భారత్ దగ్గర లేదు. దాడికి పాల్పడి అప్పటికప్పుడు ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన అయిదుగురూ పాకిస్థాన్ కేంద్రంగా గల లష్కర్- ఇ-తోయిబా, జైష్- ఇ-మహమ్మద్ సంస్థల సభ్యులని దాడి జరిగిన తెల్లవారే ఢిల్లీ పోలీసులు ప్రకటించారు గానీ, కేసు దర్యాప్తు పూర్తి చేసిన పిదప దాఖలు చేసిన చార్జిషీటులో అదేమీ లేదు. వారి పేర్లు తెలీవు, ఊర్లు తెలియవు. భారతీయులో, పాకిస్థానీయులో కూడా తెలియదు. అఫ్జల్ అయితే భారత్ అధీనంలోని కాశ్మీర్‌కు చెందిన వాడే. అయినప్పటికీ అతనిపైన మీరు కరుణ చూపిస్తే సరబ్‌జిత్‌కు మేము చూపిస్తాం అనడానికి పాకిస్థాన్ బిడియపడుతున్నది. మనం ఏ మాత్రం బిడియం లేకుండా వ్యవహరిస్తున్నాం. సరబ్‌జిత్ సింగ్ భారతదేశస్థుడే. భారత గూఢచారి వ్యవస్థ పురమాయింపు మీదనే అతను పాకిస్థాన్‌లో బాంబు దాడులకు పాల్పడ్డాడని అతని పైన అభియోగం. అయినప్పటికీ మనం అతనికి క్షమాభిక్ష పొందడం మన హక్కయినట్టు పాకిస్థాన్‌పై ఒత్తిడి పెడుతున్నాం! దావూద్ ఇబ్రహీం గురించి, మహమ్మద్ అఫ్జల్ గురించి మాట్లాడితే కోపాలు వస్తాయి కాబట్టి పేరారివాలన్ గురించి మాట్లాడుకుందాం. 16 సంవత్సరాలుగా 'డెత్ రో'లో ఉన్న ఇతని ముసలి తల్లితండ్రులు క్షమాభిక్ష కోసం ఎక్కని గడప లేదు, అభ్యర్థించని అధికారి లేడు. అతనిని ఇప్పటి దాకా ఉరితీయలేదు కాబట్టి ఇంక ఉరితీయరన్న ధీమాతో వారు ఉన్నారు గానీ దానికి కూడా భరోసా లేదు. మక్బూల్ భట్ అనే కాశ్మీరీ మిలిటెంట్ ఉండేవాడు. అతనికి 1976లో ఉరిశిక్షపడింది. గానీ 8 సంవత్సరాలు అమలు కాలేదు. ఆ శిక్ష సంగతి ప్రభుత్వం మరచిపోయినట్టేనని అందరూ భావించారు. అయితే 1984లో కాశ్మీర్ మిలిటెంట్లు బర్మింగ్‌హాంలో భారత అసిస్టెంట్ హైకమిషనర్ రవీంద్ర మాత్రేని చంపగానే మక్బూల్ భట్ ఫైలు బయటకు తీసి దుమ్ము దులిపి అతనిని ఉరితీశారు. కాబట్టి రేపు ఎల్‌టిటిఇ వారు ఏ భారత దేశ నాయకుడి పైనో దాడిచేసినట్టయితే పేరారివాలన్‌కూ శంతన్‌కూ మురుగన్‌కూ ఇన్నాళ్ళు వాయిదా పడిన ఉరిశిక్ష అమలయ్యే ప్రమాదం లేకపోలేదు.




చెప్పొచ్చేది సరబ్‌జిత్‌సింగ్ ప్రాణం కాపాడడానికి కృషి చేయొద్దని కాదు. మరణ దండన విషయంలో సూత్రబద్ధమైన వైఖరి ఉండాలని. భారత్‌కు అదే లేదు. మరణదండనను రద్దుచేసే దిశగా ఐక్యరాజ్యసమితి చాలా కాలంగా చేస్తున్న ప్రయత్నాల పట్ల అత్యంత అనాసక్తిగా ఉన్న దేశాలలో ఇండియా ఒకటి. ఎందుకని ప్రశ్నించినప్పుడు సంపన్నదేశాలు కఠిన శిక్షలు వేయకుండ బతకగలవుగానీ పేదరికం, అలజడి, సంక్షోభాలు నిత్య జీవిత వాస్తవాలయిన మనబోటి దేశాలకది అసాధ్యమని వాదించటం మన పాలకుల అలవాటు. కానీ ఐక్యరాజ్యసమితిలో మరణ దండన రద్దు విషయంలో బాగా పట్టుబడుతున్న దేశాలు సంపన్న దేశాలు కావు. నిజానికి అత్యంత సంపన్న దేశమైన అమెరికా మరణ దండన రద్దుకు బద్ధ వ్యతిరేకి. చాలా పట్టుదలగా మరణదండనను వ్యతిరేకిస్తున్నదీ, దానిని ప్రపంచవ్యాప్తంగా రద్దు చేయడానికి కృషి చేస్తున్నదీ, మనతో అన్ని రకాలుగా పోల్చదగ్గ లాటిన్ అమెరికా దేశాలు. ఉరుగ్వే, కొలంబియా ఈ ఉద్యమంలో అగ్రభాగాన నిలిచాయి. ఆ దేశాలలోనూ పేదరికం పుష్కలంగా ఉంది, అలజడులూ, అల్లర్లూ తరచుగా జరుగుతుంటాయి, మిలిటెంట్ పోరాటాలూ నడుస్తున్నాయి. వాళ్ళకు సాధ్యమైనది మనకు సాధ్యం కాకపోవడానికి సహేతుకమైన కారణమేదీ లేదు. మనం అమెరికా లాగ ఉరిశిక్ష మానవ హక్కులకు సంబంధించిన విషయం కాదనీ ఆయా దేశాల నేర శిక్షాస్మృతులకు సంబంధించిన విషయమనీ అంటున్నాం. ఐక్యరాజ్య సమితిలో మరణదండనకు సంబంధించిన తీర్మానాలపైన వోటింగ్ జరిగితే గైర్ హాజర్ అయి తప్పించుకుంటున్నాం. 1989 డిసెంబర్ 29 నాడు ఐక్యరాజ్యసమితి రెండవ ఆప్షనల్ ప్రోటోకాల్ పేరిట సభ్యదేశాల సంతకం కోసం ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. సంతకం చేసిన దేశం మరణ దండన అమలుపైన నిషేధం పెడుతున్నట్టు, కాలక్రమంలో దానిని పూర్తిగా రద్దు చేసే దిశగా చర్యలు చేపట్టబోతున్నట్టు ఆ తీర్మానం చెబుతుంది. ఆ తీర్మానాన్ని ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకించిన దేశాలలో ఇండియా ఒకటి. దానిపైన వోటింగ్ జరిగినప్పుడు ఇండియా ఎప్పటి లాగే గైర్ హాజర్ అయింది. వోటు వేసిన దేశాలలో మెజారిటీ అనుకూలంగా వేయబట్టి ఆప్షనల్ ప్రోటోకాల్ కార్యరూపం తీసుకుంది. అయితే దానిపైన సంతకం చేసిన దేశానికే అది వర్తిస్తుంది. భారత్ సంతకం చేయలేదని వేరే చెప్పనవసరం లేదు. పాకిస్థాన్ కూడా చేయలేదు. ఐక్యరాజ్యసమితి సభ్య దేశాలలో మెజారిటీ సంతకం చేశాయి. ఎట్లాగూ సరబ్‌జిత్ సింగ్ కుటుంబసభ్యులతో కలిసి అందరమూ కన్నీళ్లు పెడుతున్నాము కాబట్టి ఇప్పుడయినా భారత్ 1989 నాటి ఆప్షనల్ ప్రోటోకాల్ పైన తాను సంతకం చేసి పాకిస్థాన్‌ను కూడ సంతకం చేయమని ఆహ్వానిస్తే ఎంత బాగుంటుంది! సరబ్‌జిత్ ప్రాణంతో బాటు భారతదేశపు జైళ్లలో ఉరి కంబంకోసం ఎదురు చూస్తున్న చాలా మంది ప్రాణాలూ దక్కుతాయి. మానవ హక్కుల విషయంలో రెండు దేశాలూ ఒకడుగు సూత్రబద్ధంగా ముందుకేసినట్టూ అవుతుంది.

**ఇంతవరకు 466 మంది అంతరిక్షయానం చేశారు. వీరిలో 417 మంది పురుషులు కాగా 49 మంది స్త్రీలు.**